క్లుప్తంగా

హుండీ ఆదాయం రూ.5.49 లక్షలు

మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగాభ్రమరాంబ మల్లేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానం హుండీ ఆదాయం రూ.5,49,597 సమకూరింది. బుధవారం ఆలయ ఆవరణలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ



మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కమాండెంట్ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు గణపతి, కిరణ్, సీహెచ్వీ శేఖర్, కేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం సచివాలయ సిబ్బంది కొలనుకొండలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కొలనుకొండ ప్రధాన రహదారిలోని కొన్నిచోట్ల పైపులైన్లు మరమ్మతులకు గురై తాగునీరు వృథాగా పోతుండటంతో, మరమ్మతులు నిర్వహించి, అవసరమైన చోట కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశారు. గంగానమ్మపేటలో బోరు పంపునకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

వైభవంగా బ్రహ్మంగారి మందిర వార్షికోత్సవం



ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని బ్రహ్మంగారి అరుగు, మందిర 20వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే బ్రహ్మంగారి విగ్రహం వద్ద పూజలు చేసి పొంగళ్లు పొంగించారు. ప్రతి ఏటా బ్రహ్మంగారి మందిరం ముందు ఉన్న అరుగును శుభ్రం చేయించి పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల దొంగతనాలు జరగడంతో పోలీసులు కొంతమంది అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద కరెంటు, ఇతర సామగ్రి దొంగిలించిన విషయంలో మంగళగిరి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా, వారిలో ముగ్గురు జాతీయ రహదారి వెంబడి కొలనుకొండ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుత్ పరికరాలు దొంగిలిస్తూ బైక్‌తో సహా పట్టుబడినట్లు తెలుస్తోంది. ఆ ద్విచక్ర వాహనం కూడా వేరే ప్రాంతం నుంచి దొంగిలించి ఇక్కడ దొంగతనానికి ఉపయోగించినట్లు సమాచారం.

నేటి నుంచి వినియోగదారుల ప్రజాభిప్రాయ సేకరణ

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై గురువారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు తుళ్లూరు మండలం రాయపూడిలోని డాక్టర్ వైఎస్సార్ విద్యుత్ భవన్‌లో విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీవీ తులసీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడేపల్లి పట్టణంలోని హైవే టవర్స్, ఉషోదయ సూపర్‌మార్కెట్, విజయ్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు



ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆలయ రహదారికి అడ్డుగా వేసిన ఫెన్సింగ్ తొలగింపు

బడేపురం(తాడికొండ): బడేపురం గ్రామంలో ఆలయాల వివాదానికి పరిష్కారం దిశగా రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. కొండపై ఉన్న ఎస్సీలకు చెందిన మేరీమాత విగ్రహం వద్దకు వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేయడంతో వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్సీలు 100 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలను సముదాయించేందుకు అధికారులు యత్నించి ఫెన్సింగ్ తొలగించాలని సూచించారు. ఓ వర్గం ససేమిరా అనడంతో బుధవారం డీఎస్పీ పోతురాజు, పలువురు సీఐలతో పాటు తహసీల్దార్ ఫణీంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వ్యవహారం ఆర్డీవో కోర్టులో ఉన్న నేపథ్యంలో ఫెన్సింగ్ తొలగింపు దిశగా చర్చలు జరిపి పోలీస్ పికెట్ నడుమ ఫెన్సింగ్‌ను తొలగించడంతో వ్యవహారం కొంత మేరకు సద్దుమణిగింది. ఆర్డీవో కోర్టులో ఈ నెల 21న ఇరువర్గాలు భేటీ కానున్న నేపథ్యంలో సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడతాయా? మరింత జటిలం అవుతుందా? అనేది చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థులు పోటీకి తగ్గట్టుగా తయారవ్వాలి

- వందశాతం ఉద్యోగాల కల్పనే కేఎల్‌యూ లక్ష్యం
- డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు



ప్రసంగిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: ఆధునిక వ్యాపార రంగంలో పెరిగిన పోటీకి అనుగుణంగా ఎంబీఏ చదువుతున్న విద్యార్థులు తయారవ్వాలని కేఎల్‌యూ డీన్ ఎంహెచ్ఎస్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంబీఏ సదస్సులో ఆయన ప్రసంగించారు. జాతీయ స్థాయిలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన ఇమార్టికస్ అనే విద్యా సంస్థతో కలిసి కేఎల్ బిజినెస్ కళాశాల సంయుక్తంగా నిర్వహించనున్న ఎంబీఏ ఫిన్‌టెక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇమార్టికస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అపూర్వ ముఖ్యఅతిథిగా విచ్చేయగా, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమదివ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హేమదివ్య మాట్లాడుతూ కేఎల్ బిజినెస్ కళాశాల 2009లో తమ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ సదస్సులో ఐఐటీ రూర్కీ యాజమాన్య అధిపతి డాక్టర్ రజత్ అగర్వాల్, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎంబీఏ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

60 ఆటోల సీజ్, రూ. 33వేల జరిమానాలు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ నిసార్ బాషా

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. లైసెన్సులు లేకుండా మైనర్లు ఆటోలు నడుపుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎండీ నిసార్ బాషా నేతృత్వంలో నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, హిమని సెంటర్, ఆర్కేటీ, బోసు బొమ్మ సెంటర్‌తో పాటు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. లైసెన్సులు లేకుండా ఆటోలు నడుపుతున్న 60 మందిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. దీనితో పాటు ఆటోల్ని అద్దెకు ఇస్తున్న యజమానుల్ని కూడా పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిసార్ బాషా స్పష్టం చేశారు. మరోమారు పునరావృతం అయితే ఆటో యజమానుల పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోకు రూ. 550 చొప్పున రూ. 33వేలు జరిమానాలు విధించారు.

అంతర్జాతీయ బృందానికి భారత ప్రతినిధిగా కేఎల్‌యూ పరిశోధకుడు



డాక్టర్ షేక్ చాంద్ బాషా

తాడేపల్లిరూరల్: ప్రపంచ వ్యాప్తంగా న్యూరో కెమిస్ట్రీపై పరిశోధన చేసే అంతర్జాతీయ బృందానికి భారత ప్రతినిధిగా కేఎల్‌యూ పరిశోధకుడు డాక్టర్ షేక్ చాంద్‌బాషా ఎంపికైనట్లు విశ్వవిద్యాలయ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు తెలిపారు. బుధవారం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యూరో సైన్స్‌పై వివిధ పరిశోధనలు చేసిన అనేక మంది పరిశోధకులు ప్రపంచ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకోగా కేఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ షేక్ చాంద్‌బాషా ఎంపికవడం హర్షణీయమన్నారు. అంతర్జాతీయ న్యూరో కెమిస్ట్రీ పరిశోధన సొసైటీ ప్రధాన కార్యాలయం స్విట్జర్‌లాండ్‌లో ఉందని, గత నెలలో అమెరికాలో జరిగిన సదస్సుకు డాక్టర్ షేక్ చాంద్‌బాషాను ఆహ్వానించగా, ఆ సదస్సులో న్యూరో కెమిస్ట్రీపై తాను చేసిన పరిశోధనలను ఆయన ప్రదర్శించారని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ చాంద్‌బాషాను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ అభినందించారు.

ఖిద్మత్ బృందం సేవలు అభినందనీయం

పట్టణ సీఐ బి.అంకమ్మరావు



వికలాంగుడికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ బి.అంకమ్మరావు

మంగళగిరి: మానవ సేవలోనే పరమానందం దాగుందని గ్రహించిన పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులు ఖిద్మత్ టీమ్ పేరుతో స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి అమోఘమైన సేవలు అందించడం అభినందనీయమని పట్టణ సీఐ బి.అంకమ్మరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఖిద్మత్ టీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పట్టణ సీఐ బి.అంకమ్మరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషిగా పుట్టినందుకు తోటి వారికి సహాయపడాలన్నారు. గత మూడేళ్ల నుంచి ఖిద్మత్ టీమ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని, కరోనా కాలంలో ఎంతో మంది మృతులకు కుల, మతాలకు అతీతంగా అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారన్నారు. ఖిద్మత్ టీమ్ లీడర్ షఫీతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

బెదిరించి సెల్‌ఫోన్ లాక్కెళ్లిన ఇద్దరి అరెస్టు

పట్నంబజార్: వ్యక్తిని కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం, కొత్తపల్లి గ్రామానికిచెందిన ఆదిబోయిన గురవయ్య పలు పనుల నిమిత్తం ఈనెల 17వ తేదీ రాత్రి గుంటూరు బస్టాండ్ వద్దకు వచ్చాడు. ఆటోనగర్ వెళుతున్న క్రమంలో ఇద్దరు యువకులు కత్తితో బెదిరించి అతనిపై దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన గోవాడ మహేష్, బుచ్చయ్యతోటకు చెందిన షేక్ సోహెల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని ఒప్పుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు అడ్డుకున్న వారిపై కేసు నమోదు

తాడికొండ: వడ్డమాను గ్రామంలో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని అడ్డుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. వడ్డమాను గ్రామంలో చెరువు ఆక్రమణలు తొలగించేందుకు జేసీబీలు వెళ్లగా ఆక్రమణదారులైన పుణ్యవర్ధనరావు, సాయితేజ, ఆళ్ల మోహనరావు అధికారులపై దౌర్జన్యం చేశారు. దీంతో విధులకు ఆటంకం కలిగించినట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సచివాలయంలో జేసీ రాజకుమారి ఆకస్మిక తనిఖీ



బండారుపల్లి(తాడికొండ): బండారుపల్లి గ్రామ సచివాలయాన్ని బుధవారం జేసీ రాజకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందుతున్న సేవలు, సమాచార బోర్డులో లబ్ధిదారుల వివరాలు, సంక్షేమ పథకాల జాబితాను పొందుపరిచారా? లేదా? అని పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడి సచివాలయ సేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకొని, నిర్ణీత వ్యవధిలో ప్రజలకు సచివాలయ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ఉద్యోగులపై ఫిర్యాదులు అందితే తగిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



మోతడక(తాడికొండ): కోడ్‌నె నెస్ట్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రైనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని మోతడక చలపతి కళాశాల ప్రిన్సిపాల్ వి.రంగారావు తెలిపారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న 150 మంది విద్యార్థులకు టెక్నికల్, ఇంటర్వ్యూలు నిర్వహించగా ఏడుగురు విద్యార్థులు ఎంపికవగా కంపెనీ వార్షిక వేతనం రూ.3.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బెంగళూరులోని ఆ సంస్థ కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి ఎ.శ్రీనివాస్ అభినందించారు.

జూదరుల అరెస్ట్

గుంటూరు రూరల్: రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు నల్లపాడు పోలీసులు బుధవారం దాడిచేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం వెంగళాయపాలెంలో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు

- పనులను వేగవంతం చేయాలి
- డీఈ కృష్ణారెడ్డి



ఇప్పటంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలో స్పెషల్ గ్రాంట్ నిధులతో నిర్వహిస్తున్న పనుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని డీఈ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం, కొలనుకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఏఈ కిషోర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్పెషల్ గ్రాంట్ నిధులను ఇప్పటికే ప్రాంతాల వారీగా కేటాయించామని, ఇప్పటం, కొలనుకొండ, నూతక్కి, రామచంద్రాపురం, పెదవడ్లపూడి ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ పనులు స్థానికంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. ఇప్పటంలోని ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా పనులను వేగవంతంగా పూర్తిచేసేలా జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసుకుని పనులు చేయించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా ఆగకుండా చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి, కొలనుకొండ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు శుభ్రతపై అవగాహన అవసరం



వైద్యురాలిని వివరాలు అడుగుతున్న అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌వో అన్నపూర్ణమ్మ

ఫిరంగిపురం: 10 నుంచి 18 ఏళ్ల మధ్య బాలికలకు పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో ఇ.అన్నపూర్ణమ్మ అన్నారు. కండ్రిక గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందజేశారు. వంద మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ప్రతి రోజు ఒక గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నిర్వహించే వైద్య సేవల్లో 15 రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. మధ్యాహ్నం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో బాలబాలికలకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. బాలకలు నెలసరి సమయంలో తగిన పరిశుభ్రత పాటించేలా, వారి తల్లిదండ్రులకు వివరిస్తారన్నారు. బాల్య వివాహాలు చేయకుండా చైతన్యం తెస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమాల నిర్వహణపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఫరీనాబేగంను వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ చెంచయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలపై అవగాహన



జాతీయ స్థాయి సంగ్రహ - 2023లో పాల్గొన్న వైద్య బృందం

మంగళగిరి: చినకాకాని ఎన్నారై వైద్యశాల క్రిటికల్ కేర్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ షేక్ ఆరిఫ్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం అత్యవసర వైద్య సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి సంగ్రహ–2023 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య విభాగం అత్యంత ప్రతిష్టాత్మకమైనదన్నారు. వైద్య విద్యార్థులకు పలు విభాగాల పట్ల అవగాహన కలిగించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పలువురు ఫ్యాకల్టీ వైద్యులు హాజరుకాగా డాక్టర్ ఏహెచ్ చౌదరి, డాక్టర్ మురళీవెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సుహాసిని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

22న 'సూర్యచంద్రులు' సంగీత విభావరి



బ్రోచర్ ఆవిష్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: స్వర్గీయ ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల వర్ధంతి పురస్కరించుకుని పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో 'సూర్యచంద్రులు' పేరుతో ఈనెల 22న సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు చెప్పారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. సినీవినీలాకాశంలో సూర్యచంద్రుల వంటి వారు ఎన్టీఆర్, ఏఎన్నార్ అనే భావనతో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ గాయనీగాయకులు వారి పాటలతో అలరిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న భూహక్కు సర్వేకు శ్రీకారం

- ఆస్తి, సరిహద్దు వివాదాలకు పరిష్కారం
- డెప్యూటీ సిటీ ప్లానర్ దొర



నగరంపై డ్రోన్ సర్వే



సర్వేలో పాల్గొన్న అధికారులు

మంగళగిరి: నవ్యనగరం మంగళగిరిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారు. నగరంలోని ఆంజనేయ కాలనీ, ఆత్మకూరు నిర్మలా కాన్వెంట్ వద్ద పైలెట్ ప్రాజెక్టు కింద బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. డ్రోన్ సర్వే ఆధారంగా గృహాలు, స్థలాల సరిహద్దులను నిర్ధారించి యజమానులకు సర్టిఫికెట్లను అందించనున్నారు. డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని డెప్యూటీ సిటీ ప్లానర్ దొర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ దొర మాట్లాడుతూ డ్రోన్ కెమెరా 50 నిమిషాల సమయంలో దాదాపు 200 ఖాళీ స్థలాలు, నివాస గృహాల చిత్రాలను తీస్తుందన్నారు. వాస్తవిక సరిహద్దు లెక్కల సమాచారంతో ఫొటోలు వస్తాయన్నారు. తద్వారా సదరు ఆస్తి ఎవరి పేరిట ఎంత విస్తీర్ణంలో ఉందనే కచ్చితమైన సమాచారం వస్తుందని తెలిపారు. వందేళ్ల తరువాత ఈ సర్వే జరుగుతోందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఆంజనేయ కాలనీ, ఆత్మకూరు నిర్మలా కళాశాల ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్ట్ సంస్థ నగరం మొత్తం సర్వేను పూర్తి చేస్తుందని చెప్పారు.

సర్వే అనంతరం ప్రాపర్టీ సర్టిఫికెట్లు..

జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే పూర్తయిన తరువాత సదరు ఆస్తి తాలూకా యజమాని పేరిట సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. సదరు సర్టిఫికెట్‌లో ఆస్తికి సంబంధించి సరిహద్దు లెక్కలతో పూర్తి వివరాలు నమోదు అవుతాయన్నారు. మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 192.16 చ.కి.మీ. విస్తీర్ణం వరకూ ఈ సర్వే జరుగుతుందన్నారు. సర్వే తరువాత హద్దులు రద్దు చేయడానికి ఏ మాత్రం కుదిరే అవకాశం ఉండదన్నారు. ఆస్తి వివాదాలను సులభంగా పరిష్కరించుకోవడంతో పాటు ఆక్రమణలకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర రెడ్డి, సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అనిల్, ప్లానింగ్ సెక్రటరీ నయోమి, ఎమినిటీ సెక్రటరీ కావ్యశ్రీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నమూనా పరీక్షకు స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏసీ కళాశాలలో కానిస్టేబుల్ పోస్టుల నమూనా పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజెస్ ఆవిష్కరించారు. పరీక్షా విధానంపై అవగాహన కలిగించే ఉద్దేశంతో నమూనా పరీక్ష నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నమూనా పరీక్ష రాసిన అభ్యర్థులు ఈనెల 22న ప్రభుత్వం నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ నమూనా పరీక్ష రాయడం ద్వారా అభ్యర్థులు ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నామనే విషయాలను తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. పరీక్షకు పెద్దసంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారని, భవిష్యత్తులో గ్రూప్–2, డీఎస్సీ నమూనా పరీక్షలను సైతం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, సుధీర్, విద్యార్థి నాయకులు పి.భార్గవ, ఎం.కిరణ్‌కబీర్, అఖిల్, సుప్రజ, ఉదయ్, రినేష్ పాల్గొన్నారు.